


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 17 | మే, 2021 | సంచిక : 12



**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**



**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**

**సాయివాణి**

**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**


**విషయసూచిక** | **పుట సంఖ్య**


మా వాణి .................................... 2
శ్రీ సాయి సచ్చరితము .................... 6
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ................ 7
శాశ్వత ధర్మగోప్త ......................... 11
సాయిభక్త దాసగణు ...................... 14
మనుష్య జన్మ ............................. 17
రాలిపోయే పూలకు ........................ 19
సేవా నిరతుడు-లక్ష్మణుడు .............. 24
ముక్తి-విముక్తి .............................. 26
మాతృసంస్థ కబుర్లు ........................ 29


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



శ్రీ సాయి బంధువులందరికీ శిరసా ప్రణమిల్లుతున్నాము.

వైశాఖ శుద్ధ పూర్ణిమ శ్రీ గౌతమ బుద్ధ జయంతి, తొలుత భోగానికీ, అటుపై త్యాగానికీ, కడపట అష్టాంగ యోగానికీ కూడా సుప్రసిద్ధుడు బుద్ధ భగవానుడు. అహింస, ప్రేమ, త్యాగభరితమైన సేవ-ఇవి పదేపదే బోధించాడు ఆ మహనీయుడు. ఒక చక్రవర్తికి ఏకైక పుత్రుడై, ఒక మహా సామ్రాజ్యానికి వారసుడై వార్ధక్యం, వ్యాధి, మరణం-యీ మూడు మాటలూ తన పరిధిలోనికెన్నడూ రానవసరం లేనట్టి మహాభోగవంతమైన జీవితాన్ని గడిపిన బుద్ధుడు-పరమ లావణ్యరాశి అయిన యశోధరాదేవికీ భర్తయై, ఒక చిట్టి పాపడికి తండ్రియై-ఎట్టి చీకూచింతా లేని జీవితాన్ని నడుపుతున్న గౌతముడికి-యివన్నీ విడిచిపెట్టడానికెంత సమయం పట్టింది? కేవలం కొద్ది గంటలు మాత్రమే! జన్మ సంస్కారం ఉన్న వారికి ఆ విధమైన వైరాగ్య ప్రాప్తి కలుగుతుంటుంది. దానితో సర్వసంగ పరిత్యాగం జరుగుతుంది.

ఇంతకీ అసలు 'త్యాగం' అంటే ఏమిటి? మనకు తెలుసు 'త్యాగేనైకే అమృతత్వమానశుః" అన్నది ఉపనిషత్సూక్తి. సంతతి వలనగానీ, ధనం వలనగానీ, మరి దేని వలన గానీ శాశ్వతత్వం లభించదు. కేవలం త్యజించటం వల్ల మాత్రమే లభిస్తుంది. ఏమి త్యజించాలి? దీని విశ్లేషణ లేకపోవటం వలననే సాధకులు చాలాచోట్ల పతనం చెందే ప్రమాదం కలుగుతోంది.

మనచుట్టూ ఉన్న ప్రజలతో, పరిసరాలతో మనకు కొన్ని అనుబంధాలుంటాయి. ఇల్లు, వాకిలి, వృత్తి, ఉద్యోగం, ధనం-వీటన్నిటితో బంధాలుంటాయి. వీటన్నిటి మీదా ఏర్పడే మమకారాలను, అభిమానాలను విడవటం కొంత కష్టమే. అయితే-కేవలం ఇల్లూ-వాకిలీ, భార్యాబిడ్డలు లేదా భర్త, పిల్లలు, అత్తమామలు, అక్కాచెల్లెళ్లు-యిలా చుట్టరికాలన్నీ విడిచిపెడితే-ఉద్యోగం మాని దైవధ్యానంలోనే ఉంటూ ఉంటే-మనం త్యాగం చేసినట్లేనా? ఇవన్నీ మన శరీరానికి బాహిరంగా ఉన్నవి. వాటిని తేలికగా కాకపోయినా-మొత్తం మీద వదిలిపెట్టవచ్చు. ఇది త్యాగంలో ఒక భాగం-తొలిదశ మాత్రమే అసలైనది మలిదశే.

మన లోలోపల స్థావరం ఏర్పరుచుకొని ఉన్న బంధుమిత్రులు, శత్రువులు కూడా ఎందరో ఉన్నారు. ప్రేమ, కరుణ, సానుభూతి, మైత్రి, లాలిత్యం, స్థిర చిత్తత, దానం, శౌచం వంటి గుణాలన్నీ మనకు మిత్రులైతే అరిషడ్వర్గంగా పిలువబడే కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు వీటన్నింటికీ మూల కారణమై, ఊహ తెలియని నాటి నుంచీ-ఊపిరి ఉడిగేవరకూ కూడా విడువకుండా వెన్నంటి ఉండే అహంకారం-యివన్నీ మన శత్రువులు. మరి వీరందరినీ వదిలించుకోవటం మాటేమిటి? అవి కూడా వదిలితేనేగదా మనకు త్యాగం పరిపూర్ణమయ్యేది.

“నేనీపని చేసాను-నేను చేసిన పని వలన యింత గొప్ప ఫలితం వచ్చింది. నేను కాక మరెవ్వరైనా ఐతే యింత బాగా చెయ్యలేకపోయేవారు!” - ఇలా పొంగిపోవటం అహంకార జన్యమే. “నాకు రావలసిన కీర్తి యితరులకు పోతోంది. ఫలానా వారు నా గొప్పతనాన్ని గుర్తించటం లేదు-లేదా అడ్డుపడుతున్నారు” ఇలా ఏవేవో దుఃఖాలు, మథనాలు. ఇవన్నీ మన అహంకారాన్ని మూలంగా చేసుకొని పెరిగేవే. ఇవన్నీ వదిలిననాడే





దాన్ని త్యాగం అనగలం.

త్యాగానికి తొలిమెట్టుగా దానం ఉంది. అది కూడా సాత్త్వికం, రాజసం, తామసం అని మూడు రకాలున్నాయి శాస్త్రాలు. “ఇవ్వగలగటం నా పూర్వ జన్మ సుకృతం. ఇది నా అవకాశం, ఈ అవకాశం కలగటం నా మహద్భాగ్యం” అనుకోవటం సవ్యమైన సాత్త్విక మార్గం. అలాకాక “ఇలా యిస్తున్నందుకు ఇలాటి ప్రతిఫలం, గుర్తింపు లేదా గౌరవం కావాలి”-అనే భావన, కనీసం పుణ్యాన్ని ఆశించే కోరిక ఉన్నా అది రాజసం అవుతుంది. పరమపూజ్య గురుదేవులు అన్నట్లుగా “ఒక పూట ఫలానా స్వామికి భోజనం పెట్టాను గనుక ఆయన నేను వెళ్ళినప్పుడల్లా నాకు దర్శనమిచ్చి, నాకు అనుకూలంగా ప్రవర్తించాలి” అన్న మాదిరి భావనతో చేసే దానం తామసం అవుతుంది. శుద్ధ సాత్త్విక దానం వలన మాత్రమే సత్ప్రయోజనాలుంటాయని శాస్త్రం. సామాన్యమైన దానానికే యింత విచక్షణ అవసరమైతే యిక త్యాగానికి ఎంతుండాలి? అటువంటి సర్వోత్కృష్టమైన త్యాగానికి ప్రతిబింబం బుద్ధ భగవానుడు.

తనదేవేరి యశోధరాదేవి పరమలావణ్యమూర్తి. తాను నిత్యం సుఖాలలో మునిగి తేలే మహాభోగి. అయినా ఆయన వాటిని త్యజించడానికి ఏమాత్రము సంచలించలేదు. తన నవజాత శిశువును, అనంతమైన సంపదలను కూడా అవలీలగా త్యజించాడు. తన శరీర సౌందర్యం మీది స్పృహను కూడా క్షణంలో జయించి శిరోజాలు ఖండించుకోగలిగాడు.

తపస్సమాధిలో ఉన్న బుద్ధుని పరీక్షించడానికి స్వయంగా మారుడే (మన్మథుడే) దిగి వచ్చి కూడా ఓడిపోయాడు. తన సాటి మునులెవ్వరూ సాధించలేని జ్ఞానాన్ని పొందినప్పుడు బుద్ధునిలో అనంతమైన ప్రేమ, వినయం ప్రవేశించాయట! జ్ఞానం పెరిగేకొద్దీ వినయం పెరుగుతుంది

మహనీయులకు. అదే నాలుగు మాటలు నేర్చినా ఓ చిన్న పని సాధించినా అహం పెరుగుతుంది మూఢులకు. పరమజ్ఞానియై వేలాదిమంది శిష్యులను పొందినప్పటికీ బుద్ధుడు కరుణ, మైత్రి, ప్రేమల పోతగా జీవించారని చెప్తుంది ధర్మపథం.

ఒకనాడు బుద్ధుడు భిక్షకై ఒక ఇంటిముందు నిలచినప్పడు ఆ ఇంటి యజమాని ఆయనను చాలా హ్యనంగా నిందించాడు. ఆ తిట్లన్నీ వింటూ కూడా నిశ్చలంగా నిలచిన ఆ మహనీయుడిని చూచి "నీకు కోపం రాలేదా?" అని అడిగాడతడు. బుద్ధుడు చిరునవ్వుతో, 'నీ యీ దానాన్ని నేను స్వీకరించలేదు" అన్నాడు. ఆ విధంగా 'అభిమానం' అన్న పేరుతో మనలో సంచరించే అహంభావాన్ని త్యజించాడాయన. అంగుళిమాలుడి వంటి మహాక్రూర నరహంతకుడు ఎదురైనపుడు కూడా ఏ మాత్రం చలనం లేకుండా భీతిని-ప్రాణం మీది తీపిని త్యజించి నిలచి అంగుళి మాలుడిని అహింసామూర్తిగా మార్చాడు. చివరికి చిన్న మేకపిల్ల కోసమైనా సరే తన ప్రాణత్యాగానికి సంసిద్ధుడయ్యాడు.

ఇదేవిధంగా ఒక చిన్న పావురం కోసం తన శరీరాన్ని కోసి యిచ్చాడు శిబి. అయితే అది ఆశ్రిత వాత్సల్యంతో చేసినది. ఇది కేవలం పొంగి వచ్చిన కరుణతో చేసినది - కనుక శుద్ధ త్యాగమైంది.

ఇలా అడుగడుగునా తనలో ఉన్న కామాది వైరి వర్గాన్నీ, అహాన్నీ త్యజిస్తూ, తన్మూలంగా లోకాలను తన పరమపావన విశ్వప్రేమతో వెలిగిస్తూ జీవించాడు గనుకనే ఆయన "బుద్ధుడై"నాడు. ఆ సాధన చేయకపోవటం చేతనే మనం యింకా "బద్ధుల"మై ఉన్నాం. ఇకనైనా త్యాగం వైపు అడుగు వేద్దాం.





# శ్రీ సాయి సచ్చరితము

## నిత్య పారాయణ గ్రంథము - భక్తి పద్య కావ్యము

రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

## అక్షర నీరాజనము



ఆ.వె. 'రంగరాయ' యనెడు రమ్యనామమునిడి
ప్రేమగా పిలిచెడు ప్రియము నాదు
గురుని కంకితముగ కూడిన భక్తితో
చేయు చున్న వాడ శిరము దించి.

కం. బ్రహ్మాండము నెఱుక పరచె
బ్రహ్మము నీవ యని చెప్పె భ్రమయున్డొలగన్
యిహమున మమకారంబును
అహమును పోగొట్టి గురుడు ఆత్మను జూపెన్.

కం. పరమాత్మను జేరగ నా
యరలందున నున్న శరము నంతము జేసెన్
శిరిడీ సాయిని గొలుచుచు
తరియించెడు పథము నాకు దత్తత జేసెన్.

తే.గీ. ఎన్ని జన్మల బంధమో యెఱుగ రాదు
గురుని అనుబంధ సంధాన గురియుగల్గ
సాయిధామాన ఆధ్యాత్మ సాధనలతో
సాయి మార్గాన నడిపించె సవ్య పథము

శ్రీశ్రీశ్రీ సత్య పదానంద ప్రభుజీ సామికేను
అంకితముగా సమర్పించు ఆది పద్య
రచన సాయి సచ్చరిత పారాయణ మను
భక్తి కావ్యము సంప్రీతి భక్తి తోడ.

**(సశేషం)**

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

అది వర్షాకాలం కావటంతో ఆ రోజు ఈదురుగాలులతో విపరీతమైన వర్షం కురియగా తెరచి ఉంచిన కిటికీ ద్వారా నీరు గదిలోకి ప్రవేశించి అక్కడ గల పుస్తకములు, ఇతర వస్తువులన్నియు నీటిలో తడిసిపోయినను కిటికీకి అతి సమీపముననే గల స్వామీజీ విగ్రహం మీదగానీ, స్వామీజీకి సమర్పించిన నూతన వస్త్రములపైనగాని మచ్చుకు ఒక్క చుక్క నీటి బిందువు కూడ పడకపోవటమేగాక కనీసం చెమ్మగిల్లలేదు. వింతలలోనే వింతయైన ఈ వింతను గాంచిన జరీనా కొంత తడవు విస్మయురాలైన పిమ్మట ఇదంతయు స్వామీజీ లీలయేనని గ్రహించెను. ఈ లీలను శ్రీమతి జరీనా "గురుదేవుని లీల"యని ఆనందోత్సాహముతో వివరించెను.

సాయి, స్వామీజీల దర్శనార్థం షిరిడీకి వచ్చిన శ్రీమతి జరీనా ఒక రోజున స్వామీజీ తనకు ఏదైన ఆంగ్లములో ప్రచురించిన బాబా గ్రంథము లిచ్చిన పఠించటానికి బాగుంటుందని తలపోసెను. ఆమె మనస్సెరింగిన స్వామీజీ ఆమెను తన గదికి ఆహ్వానించి ఆంగ్ల భాషలో ప్రచురితమైన నాలుగు గ్రంథాలను బహూకరించెను.

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు రచించిన సాయిబాబా గ్రంథాలను షిరిడీని సందర్శించే సాయి భక్తులకు అందించాలన్న ఉద్దేశ్యంతో స్వామీజీ ఆశీస్సులు పొంది లెండీబాగ్‌కు సమీపమున నగర్-మన్మాడ్ మెయిన్ రోడ్డులో ఒక షాపును బాడుగకు తీసుకొని దానికి శ్రీ పి.సాంబ శివరావు (పి.యస్.రావు)గారిని మేనేజరుగా నియమించారు. శ్రీ రావు స్వామీజీ యందు అచంచల విశ్వాసం గలవారు. ప్రతి నిత్యం స్వామీజీ సమక్షంలో సద్గ్రంథ పారాయణ గావించేవారు. వీరెప్పడు స్వామీజీ





ఒక్కసారైనా తమ పవిత్ర పాదంతో షాపును పునీతం చేస్తే బాగుంటుందని మనస్సులో తలచేవారు. ఒకనాడు ఉదయమే షాపు తెరచి అగరబత్తులు వెలిగించి, దీపారాధన చేసి ప్రక్కకు చూడగా షాపులో స్వామీజీ దర్శన మివ్వగా రావు ఆనందభరితుడై స్వామీజీకి పాదాభివందనమొనరించి తలెత్తి చూడగా స్వామీజీ అంతర్థానమయ్యారు. శ్రీరావు ఈ విషయాన్ని స్వామీజీకి వివరించగా తాను రాలేదనియు బాబాయే తన రూపంలో వచ్చి ఉంటారని వివరించారు.

మరొక పర్యాయం జర్మనీ దేశం నుంచి ఒక సాయి భక్తుడు షిరిడీకి రాగా స్వామీజీ అతనిని తీసుకొని భరద్వాజగారి బుక్‌స్టాల్‌కు వచ్చి "సాయి బాబా ది మాస్టర్" అనే గ్రంథాన్ని కొని ఆ విదేశీయునికి బహూకరించారు. ఈ రీతిన స్వామీజీ రావు మనోవాంఛ నీడేర్చారు.

**స్వామీజీ వివరించిన సాయి లీలలు :**

స్వామీజీ బాబా పాద ధూళితో పరమ పవిత్రతను సంతరించుకున్న షిరిడీ ధరిత్రిపై కాలిడినది మొదలు దేహత్యాగం చేసే చివరి ఘడియ వరకు కోటానుకోట్ల సాయి లీలలను సేకరించి సాయిభక్తులకందించెను. వాటన్నిటిని ఈ గ్రంథంలో ప్రచురించడం సాధ్యం కాక అతి ముఖ్యమైనవి, ఇంతవరకూ ప్రచురితం కాని సాయి లీలలను స్వామీజీ బోధించిన సాయి తత్వాన్ని సాయి మరియు స్వామీజీల ఆశీస్సులతో మీకందిస్తున్నాను.

స్వామీజీ ఎల్లప్పడు బాబా అయోని సంభవుడు ఆయన సాక్షాత్తు దత్తాత్రేయుడే అని చెప్పేవారు. సాయి ఏనాడు తమ తల్లిదండ్రుల గురించి ప్రస్తావించలేదు. బాబా సశరీరులుగా ఉన్నప్పడుగానీ, మహాసమాధి చెందిన తరువాతగానీ ఎవ్వరూ బాబా వారసులమని చెప్పలేదు. బాబా మహాసమాధి చెందిన తరువాత బాబా వారసులెవరైనా ఉంటే వారికి బాబా ఉపయోగించిన వస్తువులను అందజేస్తామని ప్రకటించినప్పడు కూడ ఎవ్వరూ బాబా వారసులమని ముందుకురాలేదు. బాబా ఈ అవ

తారంలో పదునారేండ్ల యువకునిగానే ప్రకటితమయ్యారు. బాబా స్వయంగా **"బ్రహ్మము నా తండ్రి, మాయ నా తల్లి, వారి కలయిక వల్లనే ఈ శరీరం ఉద్భవించినది"** అని చెప్పారు. బాబా ఏ సందర్భములోను అసత్యమాడలేదు. అసత్యమాడవలసిన అగత్యం కూడ బాబాకు లేదు. ఈ అవతారంలో బాబాకు బాల్యంగానీ, తల్లిదండ్రులుగానీ లేరని వారు సాక్షాత్తు జనన మరణాల కతీతుడైన పరబ్రహ్మయని వక్కాణించేవారు. నామదేవు భీమారధి తీరమున గోణాయికి ముత్యపుచిప్పలోను, కబీరు బాగీరథ నదీ తటమున తమాలుకు లభించిరి. వీరిరువురిని అయోని సంభవులని నమ్మిన ప్రజలు బాబా అయోని సంభవుడని ఎందుకు విశ్వసించరో అర్థం కాదని స్వామీజీ వివరించేవారు. ఒక చోరత్వపు కేసు సందర్భమున కోర్టు రిసీవరు బాబాను "మీ వయస్సెంత?"యని ప్రశ్నించగా బాబా "నా వయస్సు లక్షల సంవత్సరాలు" యని సమాధానమిచ్చెను. వీటన్నిటిని బట్టి బాబా నిక్కముగా అయోని సంభవుడేనని మనము గ్రహించవలెనని స్వామీజీ వచించేవారు. నది మూలం, యోగి జననం గురించి తెలుసుకునే ప్రయత్నాలు కూడ చెయ్యకూడదని మన పురాణాలు ఘోషిస్తున్నా బాబా జననాన్ని గురించిన తర్క వితర్కాలు స్వామీజీని కలవరపరచేవి.

బాబా యొక్క గురువును గురించి ప్రస్తావించినప్పుడు కూడ స్వామీజీ "బాబా సద్గురువులకే సద్గురువు. సచ్చిదానంద సమర్థ సద్గురువు. ఆది గురువైన దత్తావతారు"డని అచంచల విశ్వాసంతో చెప్పేవారు. వెంకూసా విషయం ప్రస్తావించగా వెంకూసా అసలు నామధేయము గోపాల్‌కృష్ణ కేశవరాజ్ బాబా సాహెబ్ మహరాజ్ అనియు, ఈయన వేంకటేశ్వర స్వామి భక్తుడగుట వలన అందరు ఈయనను 'వెంకూసా' అని పిలచెడివారు. ఈ మహాభక్తుడు 1801వ సంవత్సరములో మహాసమాధి చెందెనని చరిత్రలో నుండుటయేగాక ఆయన వారసులు సహితము దీనిని ధృవీకరించిరనియు, కావున బాబా అవతార ప్రారంభానికి సుమారు నాలుగు





దశాబ్దముల ముందే మహాసమాధి చెందిన వెంకూసా బాబాకు గురువు కాదన్న విషయాన్ని స్పష్టపరచుచున్నదని చెప్పేవారు. షిరిడీలోని 'గురుస్థాన్' విషయంలో బాబా స్వయంగా తానక్కడ 12 సంవత్సరాలు తపస్సు చేసినట్లు చెప్పారు గదా! అనగా స్వామీజీ "బాబా 16 సంవత్సరాల యువకునిగా నున్నప్పుడు ఈ విషయం చెప్పారు అంటే తపస్సు ప్రారంభించే నాటికి బాబా వయస్సు 4 సం.లు గదా! అంత చిరుప్రాయంలోనే ఎవ్వరికైనా తపస్సు చేయటం సాధ్యమా? ఒకవేళ అది సాధ్యమైతే ఆయన మానవ మాత్రుడు కాదు, సాక్షాత్తు ఆ పరబ్రహ్మమే అయిఉండాలి. అటువంటి పరబ్రహ్మకు గురువు యొక్క ఆవశ్యకత ఏమున్నది?" అని ఎదురు ప్రశ్నించేవారు. మరి ఈ విషయంలో బాబా అసత్యం చెప్పారా అంటే "బాబా ఎప్పుడు సత్యాన్నే వచించేవారు. అసత్యమనే పదం బాబా నిఘంటువులోనే లేదు. బాబా చెప్పింది ఏ అవతారందో మనకు తెలియదు"ని స్వామీజీ బదులిచ్చేవారు. గురువు యొక్క ప్రాముఖ్యతను ప్రజలు విస్మరించకుండా ఉండటానికే బాబా గురువును పదేపదే ప్రస్తావించేవారు. ఎల్లప్పుడు తన చెంతనే ఉండే ఇటుక తమ గురుప్రసాదమని దానిని తన ప్రాణం కంటే మిన్నగా చూసుకుని గురువుని ఎలా గౌరవించాలో ఆచరించి చూపించారు బాబా" అనేవారు స్వామీజీ. సద్గురువులకే సద్గురువైన సాయిబాబా తానెప్పుడు గురువునని చెప్పుకోలేదు. తాను సామాన్య మానవుడిననియు, ఇతరుల నుంచి ఎంతో నేర్చుకోవాలని అనేవారు. కాని ఈ తరం వారి ప్రవర్తన ఇందుకు పూర్తిగ విరుద్ధంగా ఉందని, కాషాయ వస్త్రాలు లేక శ్వేత వస్త్రాలు, రుద్రాక్షమాలలు ధరించి బాబాను గురించి తమకు తెలిసిన మిడిమిడి జ్ఞానంతో పదిమందినీ ఆకట్టుకొని సాయి సన్నిధిలోనే గురువులమని చెప్పుకుని కీర్తిప్రతిష్టల కోసమో, భుక్తి కోసమో ప్రాకులాడే వారిని చూచిన స్వామీజీ వికలిత మనస్సులయ్యేవారు. ఈ కపట గురువుల వలలో పడి ఎంతోమంది మోసపోతున్నారని, వీరి వలన అసలైన గురువుల ఉనికికి హాని కలుగుతోందని వాపోయేవారు మన స్వామీజీ. **(సశేషం)**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

(గత సంచిక తరువాయి)

ధేనుకాసురుడు, శంఖ చూడుడు, అరిష్టాసురుడు, కేశి, అఘాసుర, బకాసురులను అవలీలగా సంహరించాడు. తోటి వారితో గోవులను మేపడానికి అడవుల్లో సంచరిస్తూ, వారితో చలుదులు కుడుస్తూ, వారితో ఆడుతూ, పాడుతూ, పడుతూ లేస్తూ అందరి హృదయాలను ఆత్మీయాను రాగాలతో జయించాడు. గోప గోపీజనం ఆబాలవృద్ధులు క్రమంగా అతణ్ణి ఒక అలౌకిక దృష్టితో చూడనారంభించారు. యాదవ కులగురువు గర్గాచార్యుడు, కృష్ణ బలరాములకు విద్యా గురువైనాడు. సాందీపని పరమాచార్యుడు రానున్న రాపిడులకు తట్టుకునేందుకు వారికి పూర్తిగా శస్త్రాస్త్ర శిక్షణనిచ్చాడు. మల్లయుద్ధంలో మెళకువలను నేర్పాడు.

కంసునికి ఎంత ప్రయత్నించినా యాదవులపై ఆధిపత్యం లభించడం కష్టం అనిపించింది. నిరంకుశ రాజనీతికి కేంద్రం జరాసంధుడు. అతడు అసుర సామ్రాజ్యవాదానికి నాయకుడు. ఆనాడున్న చంద్రవంశపు రాజులు, సూర్యవంశపు రాజులు దాదాపు వందమంది ఉండేవారు. వారిలో ఎనభై ఆరు మందిని ఓడించి, వారిని బందీలుగా పట్టుకున్నారు. వారిని తాను చేయనున్న యజ్ఞంలో బలి యివ్వడానికి నిర్బంధంలో ఉంచాడు. ఇంకా పధ్నాలుగు మంది రాజులు లభిస్తే ఆ యజ్ఞం జరుగుతుంది. తన రాజ్యంలో సనాతన ధర్మానుశాసనాన్ని నిషేధించాడు. ఆశ్రమాలను, గురుకులాలను ధ్వంసం చేశాడు. ఎంతటి విద్వాంసుడైనా, తాపసి అయినా తనను పొగడందే బ్రతకడం కష్టమయ్యేట్టు చేశాడు.

కంసుడతని పక్షాన చేరాడు. అతని కూతుళ్లను అస్తి, ప్రాప్తి అనే ఇద్దరిని





వివాహం చేసుకున్నాడు. అరణంగా భార్యల వెంటవచ్చిన మాగధుల సైన్యమును యాదవులను అణచడానికి, నిరంకుశ శాసనాన్ని నిర్వహించడానికి నియమించాడు.

అప్పడే జరాసంధుడు దిగ్విజయ యాత్రకు పూనుకున్నాడు. కంసుడు ఆయనకు సేనాధ్యక్షునిగా దాదాపు ఒక దశాబ్దంపైగా మధురకు దూరంగా వున్నాడు. ఈలోగా మధురలో యాదవగుణాల లోలోన కంసదురాగతాలను అంతం చేసే వ్యూహాన్ని సిద్ధమొనరిస్తూ వచ్చాయి.

దిగ్విజయ యాత్రలో పాల్గొని మధురకు వచ్చేసరికి వాతావరణం కంసునికి పూర్తిగా వ్యతిరేకమై కనిపించింది. చారుల వల్ల నందునింట పెరుగుతున్నది వసుదేవ నందనుడేనని తెలిసి అతడిని తుదముట్టించే ప్రయత్నం ప్రారంభించాడు.

ఆ ప్రయత్నాంకురంగా ఒక ధనుర్యజ్ఞాన్ని ఏర్పాటు చేసాడు. నందుణ్ణి, బృందావన గోప, గోపీజనాన్ని, కృష్ణ బలరాములను ఆ యజ్ఞానికి ఆహ్వానించి, తీసుకొని రమ్మని అక్రూరుణ్ణి పంపాడు. కృష్ణుని చంపించడానికి కువలయాపీడమనే మదించిన ఏనుగును, చాణూర ముష్టికులనే మల్లులను నియోగించాడు. కానీ, కృష్ణ బలరాములు మధురా హృదయాన్ని గెలిచారు. కువలాయాపీడం కృష్ణుని చేతుల్లో హతమైంది. చాణూరుణ్ణి కృష్ణుడూ, ముష్టికుణ్ణి బలరాముడూ మట్టి కరిపించారు. వెంటనే కృష్ణుడు కంసుని సింహాసనం నుండి దిగలాగి సంహరించాడు. పదహారేండ్ల నవనీత కోమలుడు గొల్లపల్లెలో పెరిగిన పసివాడు జరాసంధ సామ్రాట్టుకు సేనాధిపతి, అల్లుడూ అయిన కంసుణ్ణి అంత తేలిగ్గా చంపడంతో జనంలో ఒక అద్భుతమైన మార్పు వచ్చింది. నిజమే కృష్ణుడు అవతార పురుషుడనే విశ్వాసం ఏర్పడింది. మన త్రాత, రక్షకుడు జన్మించాడనే ధైర్యం వ్యాపించింది. కంసవధ ధర్మస్థాపనకు అలా మొదటి మెట్టైంది. ఆ తరువాతనే పంచజనులు అపహరించిన గురుపుత్రుణ్ణి రక్షించి తీసు

కొని వచ్చి, గురు ఋణం తీర్చుకున్నాడు.

జరాసంధునికి తన అల్లుణ్ణి కృష్ణుడు చంపడం సహజంగా ఆగ్రహాన్ని తెప్పించింది. ఆ కోపంతో మధుర మీదికి దాడి చేశాడు.


మధుర ఆ దాడిని ఎదిరించే స్థితిలో లేదు. జరాసంధుని పగ కృష్ణ బలరాముల మీదే కనుక కృష్ణుడూ, బలరాముడూ మధురను విడిచి పారిపోయి గోమంతక పర్వతము మీద దాక్కున్నారు. జరాసంధుడు వారి వెంటపడ్డాడు. వారితో జరిగిన పోరులో పరాభవింపబడ్డాడు. ఆ వెంటనే కృష్ణుడు జరాసంధుని సహచరుడైన శ్రీ గాలవ వాసుదేవుణ్ణి సంహరించాడు. దీనితో జరాసంధుడు తన కూటమిని మరింత పటిష్టంగా చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. తన సామంతుడైన విదర్భరాజు భీష్మకుణ్ణి ప్రోత్సహించి, అతని కుమార్తె సాక్షాలక్ష్మి - రుక్మిణిని చేది రాజ కుమారుడు శిశుపాలునికి ఇవ్వాలని స్వయంవరం ఏర్పాటు చేయించాడు. తన మనమరాలిని భీష్మకుని కుమారుని-రుక్మిణికి ఇచ్చి పెండ్లి జరిపించాలని నిశ్చయించాడు. కానీ, కృష్ణుడు మెరుపులా దాడి చేసి ఎదిరించిన రాజన్యులను ఓడించి రుక్మిణిని అపహరించుకొని వెళ్లి వివాహం చేసుకున్నాడు.

ఈ పరాభవాన్ని సహించలేక ఆర్యావర్తంలోని రాజుల మీద నమ్మకం లేక జరాసంధుడు దేశపు ఎల్లలకు ఆవలనున్న కాలయవనునితో చేతులు కలిపాడు. పడమటి నుండి కాలయవనుడు, తూర్పు నుండి తాను మధురపై దాడి చేసి, సర్వ యాదవ సంహారాన్ని రచించాలనుకున్నాడు.

కానీ, ప్రపంచంలో కనీవినీ ఎరుగనంత మహాద్భుత సాహసంతో, తెగువతో, మధుర, బృందావనాది స్థలాలలోని యాదవులందరూ కృష్ణుని నాయకత్వాన వారి చరాస్తులతో, పశుసంపదతోసహా సుదూర పశ్చిమంలోని ద్వారకకు నడిచి, ద్వారకలో సుస్థిర నివేశనాలను ఏర్పాటు చేసుకున్నారు. కృష్ణుడు తనను తరుముతూ కసితో వెంటబడ్డ కాలయవనుని మృత్యువుకు కారకుడైనాడు. **(సశేషం)**







# సాయిభక్త దాసగణు

**రచన : విజయ కిషోర్**

**(గత సంచిక తరువాయి)**

తన హృదయంలో సద్గురు సంకల్పానుసారంగా జరుగుతున్న చర్యా విధానాన్ని (మెకానిజం)-ఆ మోహినీరాజ్ దేవాలయంలోనే ప్రతీకాత్మకంగా (సింబాలిక్) ప్రదర్శించి తనలోని తమాషా బలహీనతను పరిపూర్ణంగా త్యజించడం, దాసగణు యొక్క సూక్ష్మ బుద్ధి కుశలతకు తార్కాణం! మోహినీరాజ్ దేవాలయంలో తన చివరి తమాషా ప్రదర్శన తరువాత తాను రచించిన తమాషాలన్నిటిని చించివేసి అగ్నికి ఆహుతి చేసాడు. ఆ తరువాత దాసగణు ఎన్నడూ తమాషాల జోలికి వెళ్ళలేదు. ఆ విధంగా బాబా దాసగణు యొక్క తమాషా లాలసత్వాన్ని నశింపజేసి, ఈశ్వర లీలా సత్వానికి వశింపజేసారు.

దాసగణు యొక్క కావ్యపటిమా సౌరభాలు సర్వత్రా గుబాళిస్తున్న రోజులలోనే, భావిక భక్తుల హృదయాంతరాళలో దైవనామాన్ని ప్రతిధ్వనింపజేసి, వారి మనసులను భక్తి రాగరంజితం చేసి, తన్మయత్వంతో, తాదాత్మ్యతతో వారి తనువులనూగించే కీర్తనలను ఆలపించే సంకీర్తనాకారునిగా, మధ్య భారత ప్రాంతంలో హరికథా కీర్తనా ప్రక్రియలో నూతన ఒరవడులకు నాంది పలికిన దాసగణు మహారాజ్‌గా రూపుదిద్దే ప్రక్రియకు శ్రీ సాయి తమదైన శైలిలో శ్రీకారం చుట్టారు. వివరాలలోకి వెళితే .....

1898వ సంవత్సరంలో దాసగణు యొక్క బదిలీ శ్రీ గోంద్ నుండి జామ్‌ఖేడ్ అనే గ్రామానికి జరిగింది. అప్పటికే తమాషాల రచయితగా దాసగణు ఆ ప్రాంతంలో ప్రసిద్ధుడు. దాసగణు అక్కడ పనిచేస్తున్న రోజులలో ఒక విశేషమైన ఉత్సవ సమారంభాన్ని హరికథా కీర్తనతో ప్రారంభించా

లని నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసారు. కీర్తనను శ్రవణం చేయడానికి వెళ్ళిన వారిలో పురప్రముఖులతోపాటు, దాసగణు కూడా ఉన్నారు. కానీ, కీర్తన చేయవలసిన హరిదాసు ఏదో కారణం చేత రాకపోవడంతో, తప్పనిసరి పరిస్థితులలో కీర్తన కార్యక్రమాన్ని రద్దు చేసారు. శ్రోతలందరూ నిరాశగా వెనుదిరిగారు.

ఆ సందర్భంలో జామ్‌ఖేడ్ మామ్లేదార్ అయన శ్రీ శేట్ఫళ్కర్‌గారు దాసగణుతో "అరే! గణపతిరావ్, తమాషా పాటలతో నీ బుద్ధిని నిరుపయోగించుకుంటున్నావు. దాని బదులు ఏదైనా కీర్తనను వ్రాసియుంటే ఈ రోజు కీర్తనను నువ్వే చేసియుండేవాడివి కదా!" అని అన్నారు.

"దానిదేముంది. వచ్చే ఏకాదశికి నా కీర్తనను ఏర్పాటు చెయ్యండి. ఆ లోపల నేను కీర్తనను సిద్ధం చేసుకుంటాను" అని దాసగణు తన సంసిద్ధతను వ్యక్తం చేసాడు.

"బాగుంది. కీర్తన అంటే ఆషామాషీ కాదు. అందుకు ఎంతో పాండిత్యం కావాలి. నీవు నోటికొచ్చిందేదో పాడి వెళ్ళిపోతే, తరువాత అందరూ నన్ను నిందిస్తారు" అని ఆ మామ్లేదార్ కొంచెం ఎగతాళిగా అన్నాడు.

ఆ మాటలు దాసగణు హృదయానికి కొంచెం గట్టిగానే తగిలాయి. "ఇదిగో చూడండి! అవకాశం ఇవ్వకుండా మాట్లాడడం ఉచితం కాదు. బాబా అనుగ్రహం ఉంటే ఏమైనా జరుగుతుంది. వచ్చే ఏకాదశికి నా కీర్తన ఏర్పాటు చేయండి. తరువాత మాట్లాడండి" అని కొంచెం ఉక్రోషంగా, చాలా పట్టుదలగా బదులిచ్చాడు. ఏదో సరాదాగా దాసగణు పట్ల పలుచగా మాట్లాడినప్పటికీ దాసగణు సామర్థ్యం పట్ల నమ్మకం ఉండటం వలన మరియు దాసగణుకు మద్దతుగా కొందరు మిత్రులు ముందుకు రావడం వలన శ్రీ శేట్ఫళ్కర్‌గారు కావాల్సిన ఏర్పాట్లను చేసారు. దాసగణు కూడా ఎంతో పట్టుదలగా, అందరినీ ఆశ్చర్యచకితులను చెయ్యాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. అందుకు తగ్గట్టుగా కీర్తన యొక్క ఆఖ్యానంగా పాండు





రంగ భక్తుడు మరియు సత్పురుషుడు అయిన "దామాజీ జీవన చరిత్రను" ఎంతో వినూత్నమైన రీతిలో హృదయంలో ముద్రించుకుపోయే విధంగా వ్రాసుకున్నాడు.

ఏకాదశి రోజు రానే వచ్చింది. "శృంగార గీతాల రచయిత గణపతిరావు కీర్తన చేయబోతున్నాడు. చూద్దాం ఏం చెపుతాడో" అనే కుతూహలంతో పెద్ద సంఖ్యలో జనాలు వచ్చారు. దాసగణు బాబాకు మనసులో నమస్కరించుకొని కీర్తనలు మొదలుపెట్టాడు. అంతే, తరువాత ఏం జరిగిందో, ఎలా కాలం గడిచిందో, తమ కనుల నుండి భక్తి ప్రేమాశ్రువులు ఎంతసేపు ధార కట్టాయో శ్రోతలకు తెలియలేదు. వారు దాసగణు కీర్తనలో అంతగా తల్లీనం చెందారు. కథలో వచ్చే "కరువు పరిస్థితులు, శ్రీ దామాజీ ఉదారత, పాండురంగని ప్రార్థిస్తూ రోదించడం, పాండురంగడు దామాజీని కాపాడ డానికి మారురూపంలో రావడం" వంటి సంఘటనలను దాసగణు భక్తి భావంతో మమేకమై వర్ణించినతీరుకు శ్రోతలు తీవ్ర భక్తి భావోద్వేగానికి లోనై, తనువులు తన్మయత్వంతో రోమాంచితమై తెలియని పారవశ్యంలో ఓలలాడారు. కీర్తన ముగిసిన తరువాత కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. ఆ విధంగా, మధ్య భారత ప్రాంతంలో అత్యంత ప్రభావశీలుడైన కీర్తనా కారునిగా ఆవిర్భవించిన దాసగణు మహారాజ్ యొక్క తొలి సంకీర్తన- సాయి సంకల్పానుసారంగా సాకారమైంది.

జరిగినదంతా యాదృచ్ఛికం కాకుండా, శ్రీ సాయి ఐచ్ఛికంగానే జరిగిందని, తరువాత రోజులలో కీర్తనాకారునిగా శ్రీ దాసగణు పొందిన యశస్సుని బట్టి, దాసగణు కీర్తనల ద్వారా ప్రేరితమై, సాయి దర్శనం కోసమై బారులు తీరిన భక్తుల సంఖ్యను బట్టి మనకు విస్పష్టంగా విశదమవుతుంది.

ప్రాపంచిక కోణంలో పరిశీలిస్తే, సమాచార వ్యవస్థకు సంబంధించి ఆ రోజులలో వార్తాపత్రికలు మినహా ఇతర ఎటువంటి సదుపాయం లేదు.

**(సశేషం)**

# మనుష్య జన్మ

**- పూజ్యపండిత గోవడేసే (ఈశావాస్య ఉపన్యాసములు-నుండి)**

జీవుడు ఈ శరీరంలో ఉండే, సాధన చెయ్యాలి, ఆ సాధనమెలా? అతడీ శరీరంలో క్రొత్తకర్మలు చేయకుండా ఉండటానికి ప్రయత్నం చెయ్యాలి. కర్మలు మూడు విధములుగా ఉన్నాయి. సంచితములు, ప్రారబ్దములు, క్రియామాణములున్నవి. సంచిత కర్మలు అంటే, పూర్వ జన్మములలో చేసి కూడబెట్టిన కర్మలు, ప్రారబ్ధములు అంటే-సంచిత కర్మలలో నుండి కొన్ని ఈ జన్మలో ఫలములననుభవింపజేయుటకు ప్రారంభించిన కర్మలు, క్రియమాణములు (ఆగాములు) అంటే-ఈ జన్మలోచేసే క్రొత్త కర్మలు. వీటికి ఫలం యీ జన్మలో అనుభవిస్తాము. కాని, కొన్ని కర్మలు అనుభవించకుండా మిగిలిపోతాయి. వీటిని వచ్చే జన్మలలో అనుభవించ వలసి ఉంటుంది.

జీవులు కర్మయోనులని, భోగయోనులని రెండు రకములు. యోని అంటే శరీరమని అర్థం కొన్ని శరీరములలో శుభాశుభ కర్మలు చేయడానికి వీలుంటుంది. వీటిని కర్మయోనులు అంటారు. కొన్ని శరీరాలలో కర్మఫల మనుభవించడమే జరుగుతుంది. వాటిలో క్రొత్త కర్మలేవీ చేయబడవు. అందుచేత వానిని భోగయోనులు అంటారు. మనుష్య శరీరముకాక, మిగిలిన పశుపక్ష్యాది శరీరములన్నీ భోగ యోనులు. మనుష్య శరీరంలో జీవుడు శుభాశుభ కర్మలనాచరించడానికి వీలున్నది. కొన్ని కర్మల ఫల మునుగూడ అనుభవించుటకు వీలున్నది. కనుక మానవుడు ఉభయ యోని. తప్పచేసి జైల్లోపడిన వాడు తాను స్వతంత్రించి ఏ పని చేయ డానికి వీలులేదు. అలాగే జంతు శరీరాల్లో కూడ. పశువులు మాతృగమనం చేస్తాయి. అది తప్ప కాదు. మనుష్యులు చేస్తే తప్ప. పశువు చేలోపడి మేస్తుంది. దానికది ఆహారం, కాని కావలివాడు చూస్తూ ఊరుకుంటే





ఆసామి కోప్పడతాడు గనుక దాన్ని ఆదలించుతాడు. పశువు దొంగతనం చేస్తే తప్ప లేదు. మనిషి దొంగతనం చేస్తే మాత్రం తప్ప. కనుక జంతు శరీరాల్లో జీవుల కర్మల ఫలాలనుభవిస్తాయి. అంతే.

జన్మకు కారణమైన క్రొత్త కర్మలు చేయకుండా ఉండాలి. అలా ఉంటే జన్మ రాదు. మరియు కర్మలు చేసి కూడ బంధనంలోపడకుండ ఉండ వచ్చు. అదెలా? మనమిపుడు చేసే కర్మలు ఫలాపేక్ష లేకుండా చేస్తే బంధనంలో పడం. కొందరిలా అంటారు. పూర్వజన్మలలో చేసిన కర్మల ప్రభావం వలననే కదా, మళ్ళీ యీ జన్మలో మనం కర్మలు చేస్తున్నాము. మరి ఈ శరీరంలో క్రొత్త కర్మలు చేయడమంటే యేమిటి? ప్రారబ్ధకర్మల ఫలితం అనుభవించడం అంటే అర్థమేమిటి? అంటారు. ఈ కర్మ రహస్యము చాలామందికి తెలియదు. దీని అర్థమును మన ఋషిపుంగవులు యిలా చెప్పారు, పూర్వవాసనలు ఈ జన్మలో మనచేత క్రొత్త కర్మలు చేయించవు. మనము చేసే పనులన్నీ యిప్పడే చేస్తాం. ఇది మనం బాగా గుర్తించాలి. ప్రారబ్ధకర్మల ఫలితం ఎలా అనుభవిస్తామో ఒక ఉదాహరణ చెబుతాను. అజాగ్రత్తగా దారిన నడుస్తాను. ఎదురుదెబ్బ తగిలి కాలి చెక్కుకుపోయింది. అజాగ్రత్తగా ఉండి తప్ప చేసాను. నిజమే! ఈ చేసిన స్వల్ప తప్పిదానికి రెండు రోజుల్లో ఆ దెబ్బమానడం న్యాయం కాని ఒకప్పుడు చీము ఏర్పడి, కాలు తీసివేయవలసి వస్తుందని డాక్టరంటారు. కొద్ది తప్పకు యింత శిక్ష వేయడం న్యాయంగా తోచదు. మరి యీ స్థితి ఎందుకు కలిగింది అంటే యిప్పడు చేసిన దానికి, పూర్వజన్మ కర్మఫలం జోడించి అనుభవింప జేస్తున్నాడన్నమాట. ఒక్కొక్క వ్యాపారి కొద్ది పెట్టుబడితో ఎక్కువ లాభం పొందుతుంటాడు. నిజానికతని పెట్టుబడికి తగినట్టే లాభం రావలసింది. కాని, అనుకొన్న దానికంటే ఎక్కువ లాభం పొందుతాడు. కారణం, అతడు పూర్వం చేసిన సత్కర్మల ఫలితమది. ప్రాతకర్మలు మనచేత దొంగతనం చేయించవు, దొంగతనం మనం యిప్పడు కావాలనే చేస్తాము. పూర్వ కర్మలు మనచేత కేవలం ఫలాన్ని మాత్రమే అనుభవింపజేస్తాయి. మన

మీ శరీరంలో క్రొత్త కర్మలు చేయకపోతే బంధనంలో పడం. ఈ మానవ శరీరంలోనే కర్మల నుండి తప్పుకొనే ఉపాయం ఉంది. అందుకుగాను క్రొత్త కర్మలు చేయకుండా ఉండాలి. ఒకవేళ చేస్తే ఫలాపేక్ష లేకుండా కర్మలు చేయాలి. అప్పుడవి మనలను బంధించవు. ఇలా చేయుటకు తగిన యోగ్యత ఒక్క మానవ శరీరంలోనే ఉంది. తతిమ్మా శరీరాల్లో లేదు. మనకు శరీర విజ్ఞానం, భౌతిక విజ్ఞానం (సైన్స్) ముక్తినియ్యలేవు. కేవలం ఆత్మవిజ్ఞాన మొక్కటే మోక్షమునిస్తుంది. ఆ ఆత్మవిజ్ఞానం సంపాదించడం కూడ యీ మానవశరీరంలోనే సాధ్యమవుతుంది. తతిమ్మా పశు, పక్ష్యాది కూడా జంతుశరీరాలిందులకు తగినవి కావు.

'ఇహ చే దవేదీ దథ సత్యమస్తి నచే దవే దీన్ మహతీ విశష్టిః' కేన

మనుష్యజన్మలో తెలుసుకున్నవాళ్లకే మోక్షముంది. లేకపోతే నష్టము అంటే మానవేతర జన్మ మోక్షమునకు తగినది కాదు అని అర్థం.

# రాలిపోయే పూలకు రాగాలెందుకు?

మాకు తెలిసిన ఓ వృద్ధురాలికి దాదాపు ఎనభై ఏళ్లుంటాయి. నలభై ఏళ్ల వయస్సులో కట్టుకున్న భర్త కన్నుమూశాడు. ఆ తరువాత తన కళ్ల ముందే తన అయిదుగురు కొడుకుల్లో ఇద్దరు కొడుకులు, కోడలు, ముగ్గురు మనుమళ్ళు, ఓ మనుమరాలు-ఇలా తన కన్నా చిన్నవాళ్లయిన దగ్గరి బంధువులు ఎంతోమంది ఆమె చూస్తుండగానే దుర్మరణం పాలయ్యారు. అయినా ఆమె జీవనశైలిలో కించిత్తయినా వైరాగ్యపు ఛాయలు కనిపించడం లేదు. ఇప్పటికీ ఈ వయస్సులోనూ ఆమె ఆలోచనలన్నీ ఆస్తులపైనా, బంగారు నగలపైనా, మిగిలిన కొడుకులకు సంబంధించిన ఆస్తి పంపకాల పైనే! క్షణం కూడా ఆమె భగవంతుడి గురించి ఆలోచించే ప్రయత్నమైనా చేయదు. ఒక ఆలయాన్నైనా సందర్శిద్దామనుకోదు. ఆకలితో





వచ్చే బిచ్చగాళ్లకు పిడికెడు ముద్దయినా పెట్టదు. కష్టాలు, కన్నీళ్ళు... విషాదాలు, విలాపాలు-ఇలా అలల్లా అల్లకల్లోలపరిచినా వివేకంతో కూడిన వైరాగ్యం మనలో పొడసూపకపోతే అంతకు మించిన దీనత్వం మరొకటి లేదు. అందుకే జగద్గురువులు ఆదిశంకరాచార్యులు నీరు ఇంకిపోయాక చెరువు ఉనికే ఉండదనీ, బ్రతుకు మలిసంధ్యకు చేరాక కోరికల వికారాలకు తావివ్వకూడదనీ ఇలా హితవు పలుకుతున్నారు :

అవును! వయస్సు మళ్లిన వారికి కామవికారమెక్కడిది? నీరు ఎండిపోయాక చెరువనిపించుకుంటుందా? అలాగే ధనం లేనప్పుడు పరివారమెలా ఉంటుంది? తత్త్వం అనుభవమైన తరువాత సంసారబంధం ఏముంటుంది? కానీ, మనలో చాలామంది ఈ పరమసత్యాన్ని విస్మరిస్తున్నారు. రాలిపోయే వేళ కూడా పూలకొమ్మలతోనే మమేకం కావాలని పిచ్చి ఆశతో రాగాలు పలికితే ఎంత అసహజంగా ఉంటుందో; వాలిపోయే క్షణాల్లోనూ మనిషి మమకారాల మాయలో పడి విలవిల్లాడితే అంతే అమాయకంగా ఉంటుంది.

**మలిసంధ్యలోనూ మమకారాలా?......** మనలో చాలామంది జీవితంలో దశలను యథార్థంగా అర్థం చేసుకోలేక అవస్థల పాలవుతున్నారు. ఏ దశలో ఎలా ప్రవర్తించాలో తెలియక అయోమయంలో పడిపోతున్నారు. ఫలితంగా కర్మ సన్న్యాసులుగా విరామంలో విడిది చేయాల్సిన వార్ధక్యంలోనూ లేనిపోని వ్యాపకాలతో పొద్దుగడుపుతున్నారు. వయస్సుకు తగ్గట్లు హుందాగా మసలుకోకుండా, పూర్వపు వాసనల ఛాయలన్నింటినీ జీవన మలిసంధ్యలో వ్యాపింపజేస్తున్నారు.

అందుకే శంకర భగవత్పాదులు **'వయసి గతే కః కామ వికార?'** అని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ 'కామం' అంటే కోరికలు, వాసనలు, వ్యాపకాలు అని అర్థం. దురదృష్టవశాత్తూ కారణాలు ఏవైనా నేటి సమాజంలో శారీరకంగా, మానసికంగా చాలామంది తమను తాము వార్ధక్యానికి సంసిద్ధ

లను చేసుకోవడం లేదు. చక్రి చింతనతో తరించడం లేదు. తీరని కోరికలతో, తపనలతో కొట్టుమిట్టాడుతున్నారు. అందుకే వశిష్ఠుడితో శ్రీరామచంద్రుడు ఓ మారు ....

**అపి మేరు సమం ప్రాజ్ఞమపి శూరమపి స్థిరమ్।**

**తృణీకరోతి తృష్ణైకా నిమేషేణ నరోత్తమమ్॥**

'మేరువుతో సమానమైన ధీరుడైనా, మహా ప్రాజ్ఞుడైనా, నరోత్తముడైనా ఆశ, తృష్ణ వల్ల క్షణంలో ఓటమి పాలవుతాడ'ని ఆందోళనపడతాడు. శరీరం శిథిలమవుతున్నా, ఏదో అనుభవించాలనే తాపత్రయం, దాహం, కోరికలు వర్ధిల్లుతూ ఉంటాయి. మరణం దరిదాపుల్లో ఉన్నా, కోరికలు కాకుల్లా పీడిస్తూ ఉంటాయి.

నీరుంటేనే చెరువు! శరీరం శుష్కించినట్లు మనిషికి మనస్సు శుష్కించదు. అక్కడే వస్తుంది ప్రమాదం! మనస్సనే సరస్సుకు ఆశలే పెద్ద జల వనరు. ఆ జలం ఎండిపోనంత వరకు సరస్సు కళకళలాడుతూనే ఉంటుంది. ముందు ఆ ఆశల జలాన్ని ఆవిరి చేసుకోమంటున్నారు ఆ ఆది గురువులు. అయితే, పిడికిలి మించని ఈ గుండెలో, కడలిని మించిన ఆశల్ని దాచుకునే ప్రయత్నం చేస్తున్నాం; చెరువును మించి నీరును ప్రవహింపజేస్తున్నాం. ఇక శంకరుల **శుష్కే నీరే కః కాసారః...** ప్రశ్నకు జవాబు ఎక్కడ దొరుకుతుంది? తనువు సహకరించకపోయినా, కోరికలతో దాన్ని తట్టి లేపుతుంటే మనిషికి విశ్రాంతి ఎప్పుడు లభిస్తుంది? భగవంతుడి వైపునకు మనస్సు ఎన్నడు మరలుతుంది? ఒక వయస్సు నుంచి మనస్సుకు శిక్షణ నివ్వకపోతే అది అంత సులువుగా నియంత్రణలోకి రాదు. ఫలితంగానే నేడు చాలామంది మురికిపట్టిన ఆశల జలంతో నిండిన కుళ్ళు కాసారాల్లా కనిపిస్తున్నారు. వైరాగ్యపు సూర్యకిరణాలు సోకినప్పుడే ఆ ఆశల జలం ఆవిరవుతుంది. శ్రీమద్భగవద్గీతలో కృష్ణ భగవానుడు, అర్జునుడితో 'కోరికలు, అహంకార మమకారాలు, లేనిపోని





ప్రయత్నాలు, చింతలు విరక్తునిలో పొడసూపవు. భోగాసక్తి ఉన్న వానికి చిత్తవికారం సహజం. దుర్గుణాల వల్ల కలిగే దోషాలకు చిత్తవికారమే హేతువగుచున్న'దంటాడు.

**సంపదతోనే సకుటుంబ సపరివారం ...** వ్యక్తిగతంగా మనల్ని మనం పణంగా పెట్టి, తన ప్రతినిధిగా మనను లోకానికి పరిచయం చేసిన ఆ విధాతను కూడా విస్మరించి అలుపెరుగని కార్యకలాపాలతో సంపదలు సృష్టిస్తాం. కానీ, అవి దూరమైన క్షణకాలంలో ఎవరైతే మనం ఆత్మీయులని భ్రమిస్తామో, వారందరూ దూరమవుతారు. ఇది అందరికీ అనుభవైకవేద్యమే. అయినా ఏ ఒక్కరిలో కూడా కళత్ర, పుత్ర, మిత్ర, బాంధవ అనురాగాలు మాత్రం అడుగంటడం లేదు. వారిని వేరు చేసి, మనల్ని మనం చూసుకోవాలన్న ప్రయత్నం ఏ ఒక్కరూ చేయడం లేదు అందుకే శంకరాచార్యులు **క్షీణే విత్తే కః పరివారః?** అంటూ సంపదలు లేనప్పుడు పరివారమెలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. నిజానికి మనం తాపత్రయంతో పోగేసుకున్నవన్నీ గృహంలోనే ఉండిపోతాయి; అయినవారు, ఆప్తులు అనుకున్నవారంతా శ్మశానం వరకే వచ్చి తిరిగిపోతారు; చివరకు మనవెంట వచ్చేవి మన పాపపుణ్యాలే! ఈ సత్యాన్ని నిరంతరం స్మరించుకుంటూ నడచుకోవాలి. ఈ దేహంలో దారుఢ్యం ఉన్నప్పుడే మంచిపనులు చేస్తూ, ఆ మాధవుణ్ణి స్మరించుకుంటూ గడపాలి. అందుకే బలిచక్రవర్తి, వామనుడితో శ్రీ మద్భాగవతంలో ఇలా అంటాడు :

**చెలియే మృత్యువు? చుట్టమే యముడు? సంసేవార్థులే కింకరుల్**

**శిలలం చేసెనే బ్రహ్మతన్ను? దృఢమే జీవంబు? నో చెల్లరే!**

**చలితం బౌట ఎరుంగకీ కపట సంసారంబు నిక్కంబుగా**

**తలచున్ మూఢుడు సత్యదాన కరుణా ధర్మాది నిర్ముక్తుడై!** 'అయ్యో! మృత్యువు ఆప్తమిత్రుడు కాదు. యముడు దగ్గర చుట్టం కాదు. సేవకులు భక్తితో సేవించాలనే బుద్ధిమంతులు కారు. ప్రాణం శాశ్వతం కాదు. బ్రహ్మ ఈ

శరీరాన్ని రాళ్ళతో మలచలేదు. అయినా, మూర్ఖుడు సత్యం, దానం, దయ, ధర్మం వదలివేస్తున్నాడు. ఈ మాయా సంసారాన్ని సత్యమని భావిస్తున్నాడని ఆవేదన చెందుతాడు.

**తత్త్వం తెలిస్తే ఇక తాపత్రయమెక్కడ? ...** సంసార బంధాలు శాశ్వతం కాదని తెలిసిన తరువాతే మనస్సు నిలకడగా భగవంతుడివైపు మొగ్గు చూపగలదు. అయితే మన జీవితంలో ఆయనకు చివరి ప్రాధాన్యత ఇస్తున్నాం.ఎప్పుడో ఈ లౌకికమైన బాధ్యతలన్నీ తీరిపోయాక, అప్పుడు తీర్థ యాత్రలకూ, పుణ్యకార్యాలకూ కేటాయిద్దాములే అన్న భ్రమల్లో ఉంటున్నాం. ఎంత అవివేకం! **'న జానే కిస్ గలీమే జిందగీకీ షామ్ హెూజాయే'** అంటారు ఓ ఉర్దూ కవి. నిజమే ఏ మూలమలుపులో మన జీవన సంధ్యా సమయం ముగిసిపోతుందో! త్వరగా మేలుకొని యౌవనం నుంచే వివేకంగా ఆలో చించడం, విలువైన మార్గాన్ని అనుసరించడం అలవరచుకోవాలి. ధార్మిక జీవనాన్ని ఎంచుకోవాలి. ఏ వైపు నుంచి మృత్యువు కాపు కాసి, కాటేస్తుందో? జీవితాన్ని ఆ పరమాత్ముడి పాదకమలాలకు సమర్పించు కోవాలనే సత్సంకల్పంతో ముందుకు సాగిపోతే ఆయనే తనంతట తానుగా మనల్ని తన వాడిగా చేసుకుంటాడు. చిత్తాన్ని కామం నుంచి, కాంక్షల నుంచి కడు దూరంగా తీసుకువెళ్ళి, పరివార అసలు స్వరూపాన్ని తేటపరచి, సంసారబంధాల నుంచి మనల్ని విముక్తుల్ని చేస్తారు.

## మంచి మాట (నీతి శ్లోకం)


**దేవద్విజగురు ప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్।**

**బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే॥**

దేవతలను, బ్రాహ్మణులను, గురుజనులను, జ్ఞానులను సేవించుట, పవిత్రత (శౌచము), నిరాడంబరత్వము, బ్రహ్మచర్యము, అహింస అనునవి శారీరక తపస్సులు.







# సేవా నిరతుడు - లక్ష్మణుడు

కైకేయికి దశరథుడు ఇచ్చిన వరమూ, కైకేయి కోరిక కారణంగా రాముడు 14 సం.లు అరణ్యవాసం చేయాల్సి వచ్చింది. సీతకి అరణ్య వాసంతో ఎలాంటి సంబంధమూ లేదు. అయినా రాముడు ఉన్నచోటే తానూ ఉండాలనే కోరికతో (ధర్మంతో) ఆయన వెంట నడిచింది. లక్ష్మణుడికి కూడా అరణ్యవాసంతో ఎలాంటి ప్రమేయం లేదు. కానీ, అతని తల్లి సుమిత్ర 'రాముడున్నచోటే నీకు అయోధ్య, సీతే నీ తల్లి. కనుక వారి వెంటే ఉండి వారి సేవ చెయ్యి' అని లక్ష్మణుడికి ఆదేశించింది. ఆమె మాట మీద భార్య ఊర్మిళను అయోధ్యలోనే వదిలి అన్నా వదినల వెంట లక్ష్మణుడు అడివికి నడిచాడు.

13 సం.లు అరణ్యవాసంలో గడిచిపోయాయి. 14వ సంవత్సరం ఆరంభంలో సీత బంగారులేడిని చూడడం, అది తనకు కావాలని కోరడం, రాముడు వారించినా వినకపోవడం జరిగింది. అప్పుడు రాముడికి అనిపించింది 13 సం.లు నాతో అరణ్యంలో ఇబ్బంది పడింది. ఎండా వానలు, చలి అన్నిటినీ భరించింది. ఎన్నడూ ఏ కోరికా కోరలేదు. నేడు మొదటిసారి ఒక జింకను మాత్రమే అడిగింది. అని మనస్సులో అనుకుని లక్ష్మణుడిని సీతకు రక్షణగా ఉంచి, అతనితో 'నువ్వు ఏ పరిస్థితుల్లోనూ సీతను ఒంటరిగా వదలకు. ఇది మాయావులుండే ప్రాంతం. నేను వెళ్ళి జింక సంగతి తెలుసుకొని వస్తాను, అప్పుడు సీతకి అర్థమౌతుంది' అని చెప్పి వెళతాడు.

అతడు వెళ్ళి కాసేపటికి తన బాణంతో బంగారు లేడి రూపంలో ఉన్న మారీచుడిని కొడతాడు. మారీచుడు మాయావి. రావణుడు పంపగా వచ్చిన రాక్షసుడు. కనుకనే పోతూ పోతూ సీతా లక్ష్మణులను కూడా మభ్య పెట్టడానికి 'హా సీతా! హా లక్ష్మణా! అని కేకలు పెట్టి ప్రాణాలు వదుల్తాడు.

సహజంగానే ఆ కేకలు విని సీత భయభ్రాంతురాలైంది. ఆమెకు రాముడి పరాక్రమం మీద నమ్మకం లేదా అంటే ఉంది. కానీ స్త్రీకి సహజంగా భర్త పట్ల ఉండే అనురాగం, నమ్మకాన్ని కమ్మేసింది. అందుకే లక్ష్మణుడిని వెంటనే వెళ్ళమని తొందర చేసింది. అప్పుడు లక్ష్మణుడు 'రాముడు సామాన్యుడు కాడు అతడు ఆపదలో పడడు' అని ధైర్యం చెపుతాడు. అయినా సీత వినదు. వెళ్ళమని తొందరపెడుతుంది. మళ్ళీ లక్ష్మణుడు చెపుతాడు 'ఇది మాయావి ప్రాంతం. మనం విన్న ఆ గొంతు కూడా మాయావిదే. పైగా ఎటువంటి పరిస్థితుల్లోనూ మిమ్మల్ని ఒంటరిగా వదలొద్దని అన్నగారు చెప్పారు' అని.

'నీకు నా పట్ల ఏదో వ్యక్తిగత వ్యామోహం ఉంది. కనుకనే నువ్వు వెళ్ళనంటున్నావు. అన్న ఆపదలో ఉన్నా వెళ్ళనంటున్నావు' అని సీత అనగానే ఆ మాటకు లక్ష్మణుడు ఎంతో దుఃఖపడతాడు. హతాశుడవుతాడు. చివరకు ఏమీ అనలేక గీత గీసి, ఆ గీతను దాటవద్దని హెచ్చరించి వెళతాడు. తీరా అక్కడకు వెళ్ళాక రాముడు మండిపడి లక్ష్మణుడిని దూషిస్తాడు. 'నీ అంత మూర్ఖుడు మరొకడు లేడు, నేనెన్నిసార్లు చెప్పాను సీతను ఒంటరిగా వదలి రావద్దని? ఎందుకు వచ్చావు?' అని చడామడా తిడతాడు.

లక్ష్మణుని పరిస్థితి ఆలోచించండి. వెళ్ళకపోతే సీత నోటికొచ్చినట్లు మాట్లాడింది. ఇది అనవచ్చా అనకూడదా అని కూడా చూడకుండా నిష్ఠూరాలాడింది. భరించలేక ఇటువస్తే ఈయన పట్టుకుని దులిపేసాడు. ఆ సమయంలో లక్ష్మణుడి స్థానంలో మనలాంటి వాళ్ళం ఉంటే ఏంచేస్తాం? ఏం చేస్తామో అందరికీ తెలుసు. 'మీ తిప్పలు మీరు పడండి. నేను ఇంటికి పోతున్నా' అనేవాళ్ళం. కానీ లక్ష్మణుడు అలా చేయలేదు.

దానికి బదులుగా వారున్న పరిస్థితిలో ఆ మానసిక స్థితిలో 'అది సహజమే' అని అర్థం చేసుకున్నాడు. తన అభిమానం దెబ్బతిందనే విషయాన్ని పూర్తిగా విస్మరించాడు.





'నేను అనే భావం ఎప్పుడైతే మధ్యలోకి వస్తుందో సమస్యలు అక్కడి నుంచే ప్రారంభమవుతాయి. జటిలం కూడా అక్కడే అవుతాయి. అందులోనూ 'నేను' అనే ఈ అహం అన్నివేళలా ఖాళీగా ఉంటూ ఎప్పుడెప్పుడు ముందుకు వద్దామా అని చూస్తూ ఉంటుంది. నిరహంకారి, సంయమనశీలుడు, వయసులో వారిరువురి కన్నా చిన్నవాడైనా ఎంతో పెద్ద మనస్సు చూపిన ఉత్తమ స్వభావుడు లక్ష్మణుడు మనకు ఆదర్శం కావాలి.

కార్యకర్త కూడా కార్యం చేస్తున్నప్పుడు అనేకసార్లు విమర్శలు, ఆరోపణలు ఎదుర్కోవలసి రావచ్చు. వాటిని వ్యక్తిగతంగా తీసుకోకుండా కార్యం మీదే దృష్టి పెడితే కార్యం సఫలం అవడమే కాకుండా కార్యకర్తలు దగ్గరయి పని ఇంకా పెరుగుతుంది.

# ముక్తి - విముక్తి

**- శ్రీ వల్లూరి శ్రీరామచంద్రమూర్తి**

**సుప్రభాతం, సురభిళ ప్రశాంతం**

**సుశ్లోకితం, సుందర చారిణం**

**సత్యం, శివం, సుందరం**

పరమ మాహేశ్వర స్వరూపుడూ, సచ్చిదానంద గురుమూర్తి అయిన భగవాన్ శ్రీ సత్యసాయి దివ్య చరణారవిందాలకు అనేకానేక నమస్సృతులు సమర్పిస్తూ ఈనాటి ఈ సత్సంగాన్ని ప్రారంభిస్తున్నాను.

కరుణాపూర్ణ సుధాబ్ధి అయినటువంటి భగవాన్ రమణులు సాధక జగత్తు కోసం అద్వైత సారాన్నంతా ఒక జ్ఞాన మహాయోగంగా 'వున్నది నలభై' (వున్నది నలుబది) అనేటువంటి ఒక యోగమార్గాన్ని సూచించారు. గత నాలుగైదు రోజులుగా విస్తృతమైనటువంటి విచారధారలో మునిగి ఈ విచారణ సాగిస్తూ ఆధ్యాత్మ శిఖరాన్ని ఎట్లా అందుకోవాలి, ఈ existence ఈ 'చిత్తు' అనేటువంటిది ఈ 'సత్తు'ని కలిసినప్పుడు ఏ విధంగా

ఒక అమలినమైనటువంటి, అఖండమైనటువంటి, అప్రమేయమైనటువంటి, అపరిమితమైనటువంటి, అపరిమేయమైనటువంటి ఆనందాన్ని పొంది ఈ 'చిత్' 'సత్' అనేటువంటి రెండు సద్వస్తువులూ కూడా ఏక సూత్రంగా ఒక ఆనందమనేటువంటి వెలుగులో ఏ విధంగా స్నానమాడుతున్నవో, ఆ స్నానమాడుతున్నప్పడు, అటువంటి సచ్చిదానంద స్థితిని అనుభవించినట్టి ఒక జీవుడు ఈ జగత్తులో ఎట్లా ఉంటాడు? ఒక ఆత్మానుభవాన్ని పొందనటువంటి ఒక వ్యక్తి ఈ జగత్తుతో ఎట్లా అనుసంధానమై వుంటాడు? అని విచారణ చేసాము.

సాధక జీవులుగా ఈ జగత్తుతో కూడి వున్నప్పడు అనేక ప్రారబ్ధాలనో, అనేక కష్టనిష్టూరాలనో, ఇబ్బందులనో, ప్రపంచం యొక్క స్వభావాన్ని మనం వారసత్వంగా చేసుకుంటూ, దాని ప్రభావానికి లోనై, మనదైనటువంటి ఆత్మని మరచిపోయినటువంటి ఒక స్థితిలో మనం మిగిలిపోయి వున్నాం. అయితే సాధనానంతరం, సాధన సాగుతూ ఉండగా అనేకమైనటువంటి అనుభవాలు కలుగుతూ ఉంటాయి. కొందరు మెడిటేషన్‌లో తమ యిష్టదైవం కనిపించాడంటారు. కొంతమంది జ్యోతి కనిపించిందంటారు. లేకపోతే వాయిస్ వినిపిస్తున్నాయంటారు. వీటన్నింటికీ కారణం ఏమిటీ అంటే, ఆ జీవుడు మనస్సు అనే స్థాయిలో విచారణ ఆపినందువల్లనే జరుగుతున్నాయి. దీనిని అధిగమించాలి. ముప్పై సంవత్సరాలు భగవాన్ రమణులకు వేళ తప్పకుండా ప్రతిరోజూ భోజనం తయారుచేసి, ఆ రోజుల్లో స్కందాశ్రమం వరకూ భగవాన్ కోసం వెళ్ళినటువంటి ఎచ్చమ్మాళ్ ముప్పై ఏళ్ళ సాధనలో ఒకే ఒక్కసారి చాలా ఆనందంగా భగవాన్ దగ్గర ఒక మాట అంటుంది. 'భగవాన్ నిన్న మీరు నాకు దర్శనమిచ్చారు" అని. ఆయన ఏమీ చలించరు. దానికి ఏమీ రియాక్షన్ ఇవ్వరు. "దృశ్యాలు దాటటం మంచిది కదా!" అంటారు. సాధారణమైన లోకగురువైతే "అవును, నాకు తెలుసు. నిన్న రాత్రి గం.3.30లకి నీ కల్లోకి వచ్చాను" అంటాడు. కానీ





"దృశ్యం దాటు" అన్నారు రమణులు. అంటే మనస్సు యొక్క అధోచేతన స్థితిలో ఆ దృశ్యం మనకి ఏర్పడిందన్నమాట. అయితే దృశ్యం రావటం దోషం కాదు. దృశ్యమే అంత్యం కావటం మహా దురదృష్టం. అవి వస్తూ వుంటాయి. ఇటువంటి revelations కొన్ని వేలు జరుగుతూ ఉంటాయి. పూర్ణమైన జాగ్రదవస్థలోనే రమణులు manifest కావచ్చు, భగవాన్ సత్యసాయి manifest కావచ్చు. ఒక గాలివలె, ఒక పరిమళం వలె, ఒక శబ్దము వలె, ఒక మాట వలె, ఒక క్రిమి వలె, ఒక జీవి వలె, ఒక పిపీలికం వలె, ఎట్లాగైనా manifest కావచ్చు. కానీ దాని వలన ఏం ప్రయోజనం అనేటువంటి ప్రశ్న వేసుకున్నప్పడు, ఆ దృశ్యం దాటవలసిన అవసరం మనకు ఏర్పడుతుంది. దృశ్యంతోనే ఆగిపోయినట్లయితే? ప్రతిరోజూ భగవాన్ సత్యసాయి వేళ తప్పకుండా మనకి దర్శనం ఇస్తారనుకోండి, స్వాప్నికంగా మనం పడుకోగానే ఆయన కనపడ్డారు అనుకుందాం. ఒక ముప్పై రోజులు. తరువాత ఏమనిపిస్తుంది? ఈ ఒక్కరోజు రాకపోతే ఏమవుతుందో, ఆ అనుభవం ఎలా ఉంటుందో చూద్దామనిపిస్తుంది. అంటే రోజూ వస్తూ వుంటే ఆయన అనుగ్రహం అంటాం. రాని రోజు ఎట్లాగుంటుందో? ఆ అనుభవం మనకి కావాలి. వచ్చినరోజు బాగుంది. రాకపోతే? ప్రశ్న వేస్తాం. మనస్సు దగ్గర ఆగి వున్నాము. నిన్న చెప్పకున్నాం. మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారాలు ఈ నాలుగింటినీ సమీపింపచేసుకుని సచ్చిదానంద స్థితిలోకి వెళ్ళినటువంటివాడు, ఇంకా పూర్ణంగా విముక్తుడై వున్నాడా అంటే విముక్తుడు కాలేదు అన్నారు. కారణం? కర్మత్రయం ఇంకా వాడిలో వున్నది. ఏమిటా కర్మత్రయం?

కర్మలు మూడు విధాలుగా చెప్పారు. మనస్సు, వాక్కు, ఆచరణ. ఈ మూడూ ఏ స్థితిలో చేస్తున్నాం? మనస్సుని జగత్తుతో కూర్చి చేస్తున్నాం. అనుసంధానం చేసి ఈ జగత్తుకి ఎట్లా కావాలో మన మనస్సునట్లా మార్చుకుంటున్నాం. అలాగే వాక్కు.

**(సశేషం)**

# మాతృసంస్థ కబుర్లు

మార్చి 30వ తేదీ ఫాల్గుణ విదియ. తిథుల ప్రకారం పూజ్య గురుదేవుల 83వ జన్మదినం. సాధుసత్పురుషులు భౌతికంగా కనిపించకపోయినా కాలం గడుస్తున్న కొద్దీ వారి మహిమ, శక్తి ప్రపంచానికి వెల్లడి అవుతుంది. నిజంగా గురుదేవుల శిష్యులం మేము అని చెప్పకునేవారు జయంతు లకు, వర్ధంతులకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా వచ్చితీరుతారు. కరోనా కారణంగా కొద్దిమందితోనే కార్యక్రమం జరిగింది.

30వ తేదీ ఉదయం గం.6.00లకు సాయినాథుల వారికి క్షీర, జలాభి షేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజ నిర్వహించారు. గం.7.00లకు పూజ్య గురుదేవులకు అభిషేక కార్యక్రమం, గురు నామస్మరణతో సాగింది. ఆశ్రమ ప్రాంగణం అంత పచ్చటి తోరణాలతో, పూల అలంకరణతో శోభాయ మానంగా ఉంది.

భారతీయ సంప్రదాయంతో సన్యాసులకు, సాధు సత్పురుషులకు ఉన్నత స్థానం ఇవ్వబడింది. వారి సాధన, కఠోర నియమ, నిష్ఠలు, ఆధ్యాత్మిక శక్తియుక్తులు చెప్పనలవికానివి. వారి స్పర్శ వలన ఎన్నో పాపాలు తొలగి పోతాయి. ఆ భాగ్యానికి నోచుకున్న వారు శ్రీ బూర్లగడ్డ గోపీకృష్ణగారు. గురుదేవుల పాదుకలను తలకెత్తుకుని సాయినామ స్మరణతో ఉష భవనం నుండి జ్ఞానధామం వరకు గురుదేవులను ఆహ్వానించారు. గం.11.00 లకు గురుపాదుకా పూజ, వన్నెవన్నెల పూలతో, భక్తిప్రపత్తులతో పూజ పూర్త యింది. స్వామి వారికి చాలా ప్రీతికరమైన పెరుగు గారెలు నివేదన సమర్పించారు.

దీపం జ్ఞానానికి గుర్తు. 83వ జన్మదిన సందర్భంగా 83 దీపాలు వెలిగించి, భక్తులందరూ స్వామీ గురుదేవా ప్రపంచాన్ని కరోనా అనే మహ





మ్మారి వణికిస్తున్నది. దాని నుంచి సమస్త ప్రజానీకం సుఖశాంతులతో ఉండాలని మనసారా వేడుకున్నారు.

అనంతరం శ్రీశ్రీశ్రీ శ్రీరామానంద ప్రభుజీ వారు మాట్లాడుతూ గురు దేవుల జన్మదిన విశిష్టతను వివరిస్తూ-మహనీయులు ఆధ్యాత్మిక పథంలో నడుస్తూ పది మందికి నడవవలసిన మార్గాన్ని సూచన చేస్తూ మానవ జీవితాన్ని ముక్తి మార్గం వైపు నడచుకునే విధంగా దారిచూపే వెలుగే గురువు. వారందరూ మనకు ఆరాధ్యులే. గురుదేవులు సాయిధామం సేవాశ్రమంలో ఎన్నో సేవా కార్యక్రమాలు ప్రజాహితం కోసం చేసినవే. దానిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. వారు నడిచిన మార్గంలో నడుస్తూ, వారి ఆశయాలను మనం నెరవేరుస్తూ సాయిధామం ఆశ్రమాన్ని పతాకస్థాయికి చూడాలనేదే నా కోరిక. ఇది అందరం ఆచరిస్తే గురుదక్షిణ ఇచ్చినట్టే. మనం ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ వివేకవంతులం. విజ్ఞాన వంతులం కావాలని వివరించారు.

శ్రీ డా॥ జి.చంద్రారెడ్డిగారు, శ్రీ మండువ రంగారావుగారు గురు దేవులతో, ఆశ్రమంతో వారికి ఉన్న అనుబంధాన్ని, అనుభవాన్ని భక్తులతో పంచుకున్నారు.

అనంతరం గురుదేవుల జన్మదిన సందర్భముగా దివ్యాంగులకు వస్త్రదానం, వస్తు దానం జరిగింది.

శ్రీ నామ్ రవీందర్ గారి ఆధ్వర్యంలో సాయిధామంలో ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరిగే పద్ధతిని మొదలుపెట్టారు పూజ్య గురుదేవులు.

అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించి భక్తులు తరలివెళ్ళారు.

ఏప్రిల్ 13 - ప్లవ నామ సంవత్సరం సాయిధామం ఆశ్రమంలో ఉదయాన్నే ఆశ్రమం అంతా పూలతో, తోరణాలతో, పసుపు-కుంకుమలతో అలంకరించి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికింది. పిల్లలంతా వేప పువ్వు కోయడం, మామిడికాయలు కోయడం, పచ్చడి తయారు

చేయడంలో లీనమైనారు. గం.10.00లకు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు పంచాంగ శ్రవణం చేసి సంవత్సర కాలం అంతా ఎలా గడుస్తుందో వివరించారు.

ఏప్రిల్ 21వ తేదీ శ్రీరామ నవమి. సాయి దేవాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా రాముల వారికి పూజ, పట్టాభిషేకం జరిగాయి.

**శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి**

ఏప్రిల్ 13వ తేదీ నూతన ప్లవ నామ సంవత్సర ఉగాది పర్వదినం. ఆశ్రమంలో ఘనంగా జరిగినది. స్వామి వార్లందరికీ అభిషేక, పూజా కార్య క్రమాలు జరిగినవి. వచ్చిన భక్తులు నూతన వస్త్రాలంకృతులైన సీతారామ చంద్రుల వారిని, బాబా వారిని, ఆంజనేయ స్వామి వారిని, పరమ పూజ్య గురుదేవులను దర్శించి తరించారు.

ఏప్రిల్ 21వ తేదీ ఆశ్రమంలో పరివేష్టితమైన సీతా లక్ష్మణ హనుమస్సమేత కోదండ రాముల వారి కళ్యాణం వైభవోపేతంగా జరిగినది. కోవిడ్ నిబంధనల ననుసరించి మాస్క్ ధరించి, శానిటైజేషన్, సామాజిక దూరం మొదలైన జాగ్రత్తలు తీసుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కార్యక్రమం జరిగినది.

20వ తేదీ రాత్రి ఆశ్రమ కార్యకర్తలు భక్తిశ్రద్ధలతో, మామిడి తోరణాలు, అరటి, కొబ్బరి ఆకులు, పూలమాలలతో శోభాయామానంగా అలంకరిం చిన వేదికపైకి శ్రీరామమూర్తికి జై అని భక్తుల జయజయ ధ్వానాల మధ్య, మంగళ వాద్యములు రసరమ్యంగా మ్రోగుతుండగా, నుదుట బాసికాలు, నూతన వస్త్రాలు, బుగ్గ చుక్క, కళ్యాణ తిలకాలతో అలంకృతులైన సీతా రామ చంద్రుల వారిని పీటల మీద ఆశీనులను కావించాము. చూసిన వారిదే భాగ్యము అన్నట్లు దివ్యతేజస్సుతో వెలుగొందుతున్న శ్రీ రామచంద్ర మూర్తిని, సీతమ్మ వారిని చూచుటకు రెండు కళ్ళు చాలవన్నట్లుగా భక్తులు





భక్తి పారవశ్యంతో దర్శించి తరించారు. అనంతరం అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ అష్టదిక్పాలక పూజ, అంకురార్పణ, కంకణ ధారణ మొదలైన పూజలు పీటల మీద కూర్చున్న ఏడుగురు దంపతులతో కళ్యాణక్రతువు నిర్వహించారు. గం.11.58 ని.లకు అభిజిత్ లగ్న పుష్కరాంశ మందు సీతారామచంద్రుల వారికి జీలకర్ర, బెల్లం పెట్టించారు. అనంతరం పీటల మీద కూర్చున్న దంపతులచే స్వామి వారి పాదాలు కడిగించి కన్యాదానం చేయించారు. అనంతరం వేదమంత్రాల నడుమ, మంగళ వాద్య ధ్వనుల మధ్య, భక్త జన జయజయ ధ్వానాల మధ్య శ్రీ రామ చంద్రమూర్తి సీతమ్మ వారి మెడలో మాంగళ్యధారణ కావించారు. అనంతరం కళ్యాణ క్రతువు నిర్వహిస్తున్న దంపతులచే తలంబ్రాలు పోయించారు. కరోనా కష్టకాలంలో కార్యక్రమం ఇంత అద్భుతంగా జరిపించుకున్న శ్రీ స్వామి వారి శక్తిని, క్షేత్ర మహిమను మరొక్కసారి నిరూపించారు. అనంతరం సాయంత్రం గం.5.00లకు కోవిడ్ నిబంధనుల అనుసరించి సీతా సమేతుడైన కోదండ రాముల వారికి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించాము. కరోనా కష్ట కాలంలో స్వామి ఊరేగింపుగా రావడం భక్తులకు ఎంతో సంతోషం కలిగించినది. స్వామి వారిని కనులారా దర్శించి వారులు పోసి, హారతులు సమర్పించి కరోనా నుండి తమను కాపాడమని వేడుకున్నారు. రాత్రి గం.10.00లకు ఊరేగింపు కార్యక్రమం నిర్విఘ్నంగా ముగిసినది. ఆద్యంతము ఎటువంటి విఘ్నాలు కలుగకుండా కార్యక్రమం వైభవోపేతంగా జరగడానికి ఆర్థిక సహకారం అందించిన భక్తులకు, రాత్రంతా మేలుకుని ఎవరికి ఏ ఇబ్బంది కలుగ కుండా ఏర్పాట్లు చేసిన కార్యకర్తలకు శ్రీరామరక్ష. వారందరికీ శ్రీ సాయీ సేవా సమితి తరపున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము.

**జై శ్రీరామ్**